రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973 9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.

SSC GD కానిస్టేబుల్స్ & RRB
శ్రీకాకుళంలో మొదటిసారి కార్పోరేట్ ప్రమాణాలతో..
ఫ్రీ మెగా సెమినార్
తేది: 27-10-2024 (ఆదివారం) ఉదయం 9 గం॥లకు
అర్థమెటిక్: చలం రవి గారు (25 Years Experience)
ఇంగ్లీష్: గుణశేఖర్ గారు (Senior Faculty)
రీజనింగ్: తులసి గారు, శంకర్ గారు
ప్యూర్ మేథ్స్: గురునాయుడు గారు
SOLVE ACADEMY Srikakulam
86881 72010
90300 28181

ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు ▸ బట్టలు ▸ పిండివంటలు ▸ బుక్స్ ▸ స్వీట్స్ ▸ మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493



సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 29-10-2024
సంపుటి: 20 సంచిక: 183
పేజీలు: 4 వెల: రూ.1





విశ్వసముద్ర కార్యాలయానికి బోర్డు మాత్రమే మారిన ఫొటో

* 'విశ్వసముద్ర' స్థానంలో ఏఎమ్మార్
* అనుమతులు లేకుండా సీనరేజ్ వసూళ్లు
* అక్రమ తరలింపు నుంచి సొంత లాభం
* దృష్టి సారించిన విజిలెన్స్ విభాగం



విశ్వసముద్ర కార్యాలయం (ఫైల్‌ఫోటో)

# అదే పద్ధతి.. అదే అరాచకం!


రవాణా ఫారం (TRANSIT FORM)

బుక్ నెం(BOOK NO) : SKM-01/0000231
జిల్లా కోడ్ (District Code) : SKM-01
ట్రాన్సిట్ ఫారమ్ Sl.No (Transit Form Sl.No) : SKM-01/80000230803
పుస్తకం గడువు తేదీ (Book Expiry Date) : 17-11-2024

1. మైనర్ ఖనిజ రవాణా వివరాలు (MINOR MINERAL TRANSPORTATION DETAILS)

| SNO | Items | Description |
|---|---|---|
| 1. | Party ID (పార్టీ ఐడి) | 111220367 |
| 2. | Party Name & Address (పార్టీ పేరు & చిరునామా) | M.Narendra Reddy |
| 3. | Name of the Work (పని పేరు) | OTHER WORK |
| 4. | District (జిల్లా) | Srikakulam |
| 5. | Mandal (మండలం) | Kothuru |
| 6. | Village (గ్రామం) | Shobhanapuram |
| 7. | Mineral Name (కనిజం పేరు) | Road Metal |
| 8. | Unit (యూనిట్) | M3 |
| 9. | Quantity In Cbm/In Square FT (పరిమాణం) | 3 |
| 10. | Receiver Name & Address (పేరు & చిరునామా) | |
| 11. | Place of Destination (గమ్యస్థానము వివరాలు) | |
| 12. | Distance of Destination in K.M (గమ్యస్థానము దూరం) | |
| 13. | Date & Time of Dispatch (బయలుదేరిన తేదీ & సమయం) | |
| 14. | Date & Time to Reach Destination Place (గమ్యస్థానంకు చేరే తేదీ & సమయం) | |
| 15. | Vehicle No. (వాహనం నెం.) | |
| 16. | Purpose (ప్రయోజనం) | Mandal/Village Development |


(డ్రైవర్ సంతకం)
Signature of Driver

ఏఎమ్మార్ సంస్థ సొంతంగా ప్రింట్ చేయించుకున్న పర్మిట్ పత్రం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లాలో మైనింగ్ (గనులు)పై సీనరేజ్ వసూళ్లలో పెద్ద స్థాయి కుంభకోణం జరుగుతున్నట్టు తెలుస్తుంది. క్వారీలకు తరలించే రాయి, జిల్లా నుంచి వేరే ప్రాంతాలకు వెళ్తున్న గ్రానైట్, కంకర తవ్వకాలపై విధించే సీనరేజ్ వసూళ్లలో ఏమాత్రం పారదర్శకత లేకుండా కోట్లాది రూపాయలు చేతులు మారిపోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై దృష్టి సారించే సమయం జిల్లాలో మంత్రి, ప్రజాప్రతినిధులకు లేకపోవడంతో సీనరేజ్ వసూళ్ల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకున్నామంటూ ఏఎమ్మార్ అనే సంస్థ పెద్ద ఎత్తున వసూళ్ల పర్వానికి తెర లేపింది. అసలు ఏఎమ్మార్‌కు అనుమతులు ఎవరిచ్చారు, ఎంతకిచ్చారు, ఎన్నాళ్లకిచ్చారు? అన్న పత్రాలేవీ ఈ సంస్థ కింద పనిచేసే ఉద్యోగులు ఇక్కడ చూపించలేకపోతున్నారు. సీనరేజీని మాత్రం పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. ఇందుకు ప్రతిగా ఓ చిత్తుకాగితం మీద రెండు ముక్కలు రాసి రశీదుగా ఇస్తున్నారు. ఇప్పుడు ఇది జిల్లావ్యాప్తంగా వివాదాంశంగా మారింది. దీంతో విజిలెన్స్ అధికారులు కూడా అటువైపు దృష్టి సారించారు. వివరాల్లోకి వెళితే.. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత గనుల నుంచి సీనరీలు వసూలు చేసే కాంట్రాక్ట్‌ను జిల్లాలో విశ్వ సముద్ర సంస్థకు అప్పగించారు. అప్పట్లో ప్రతీ మైనింగ్ ఏజెన్సీ నుంచి వీరు పెద్ద ఎత్తున సీనరేజ్ వసూలు చేశారు. ఇందుకోసం ఆన్‌లైన్ మైనింగ్ పర్మిట్ బిల్లులు కూడా జనరేట్ చేశారు. అయితే కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత విశ్వ సముద్ర సంస్థకు సీనరేజ్ వసూలు చేయొద్దని చెప్పడంతో ఈ ఏడాది జూన్ 4 తర్వాత ఈ స్థానంలో ఏఎమ్మార్ అనే

- మిగతా 4లో


ASSISTANT DIRECTOR : SRIKAKULAM
TRANSIT FORM (Original)

HSN Code: N/A
Stationary No : CC6190024 Date & Time of Dispatch : 20/02/2023 09:22

| | | | |
|---|---|---|---|
| Lessee Id : | 0111220376 | Permit No : | PR01112203760001 |
| Lessee Name : | Sri P Mohan Rao | Consignee Name : | M/S. SRI KESAVA STONE CRUSHER |
| Consignee Address : | Rayala Road, Makavaram Village, Kothuru Mandal, Srikakulam District | | |
| Destination : | DIMILI | Mineral Name : | Road Metal |
| MDL No : | MDL0101010453 | MDL Business District : | Srikakulam |
| MDL Business Mandal : | Kothuru | MDL Business Village : | DIMILI |
| MDL/Company Name: | M/S. SRI KESAVA STONE CRUSHER | Transit Form No : | TRANSIT0222224016 |
| Survey No : | 381 | Village : | Dimili |
| Mandal : | Kothuru | District : | Srikakulam |
| Vehicle No : | AP39TK3969 | Driver Name : | KRISHNA |
| Driver License No : | AP1320160001256 | VAT / GST NO : | 37BZAPP1355B1ZP |
| Distance in K.M. : | 1 | Required Time : | 003:00 |
| Dispatch Qty : | 9 Cubic Meter | | |

Note:The Transit Form is valid only on the Printed Secured Stationary with Hologram embedded.
Note:This is System generated document ,does n't require Physical Signature.

సీనరేజ్ కోసం జనరేట్ చేసిన ఆన్‌లైన్ పర్మిట్






# కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడు కావలెను!

**సత్యంన్యూస్, శ్రీకాకుళం**

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఆ పదవి నుంచి తప్పిస్తే మంచిదినే అభిప్రాయం రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తమవుతుంది. ఎస్సీ మైనార్టీ దళితుల ఓట్ల వల్ల గతంలో ఆ పార్టీకి కొంత ఓటింగ్ పెరిగిన మాట వాస్తవం. అయితే ఇది స్పష్టంగా కాంగ్రెస్ పార్టీది కాదు. జగన్ బీజేపీ మద్దతుదారుడనే కోణం ఓట్లేశారు తప్ప, కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. మరీ ముఖ్యంగా షర్మిల వల్ల ఓటింగ్ పెరగలేదు. జగన్ మీద కోపంతో టీడీపీకి ఓటు వేయలేనివారు కాంగ్రెస్‌కు ఓటేశారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే, ఆమె జగన్ మీద ధ్వేషంతో పార్టీని నడుపుతున్నారు తప్ప పార్టీ ప్రయోజనాల కోసం కాదనేది చాలామంది కాంగ్రెస్ నాయకుల భావన. 2029లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడానికి అవకాశం ఉందనే పాజిటివ్ టాక్ వస్తున్నందున రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడటం అత్యావశ్యం. కారణాలేవైనా ప్రస్తుతం పీసీసీ అధ్యక్ష పదవికి ఒక సమర్థుడైన రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు కలిగిన నాయకుడే కరువయ్యాడు. ఇదివరకు పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన బొత్స సత్యనారాయణ ఎమ్మెల్యే పదవి కోసం వైకాపాలోకి వెళ్లి ఒకసారి ఎమ్మెల్యే కాగలిగారు. రెండోసారి అది కాస్తా జగన్ వ్యతిరేక గాలిలో ఎగిరిపోయింది. చక్కటి వాగ్ధాటి, గొప్ప రీజనింగ్ ఉన్నాయనుకున్న ధర్మాన ప్రసాదరావు కూడా ఈ ఎమ్మెల్యే పదవి కోసం జగన్ కాళ్ల దగ్గర సాగిలపడిపోయి తన వ్యక్తిత్వాన్ని కోల్పోయారు. మరింత గొప్ప వాగ్ధాటి ఉండి సహేతుకమైన వ్యాఖ్యలత జగన్‌ను ఆకట్టుకోగలిగిన ఉండవిల్లి అరుణ్‌కుమార్ తన వారాంతపు ప్రెస్‌మీట్లతో జగన్ జ్ఞాపకాల్లో అయితే ఉండగలిగారు కానీ, ఆయన దగ్గర రాష్ట్రస్థాయి నాయకత్వాన్ని అందించగలిగిన సాధన సంపత్తి లేదు. పైగా రాష్ట్రస్థాయిలో నాయకత్వం వహించాలనే కసి కూడా అతనికి ఉండదు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని విడగొట్టగానే తనను పార్టీ నుంచి వాళ్లే సస్పెండ్ చేశారన్న కారణం చూపించి రాజకీయాల నుంచి తప్పుకున్నారు. తనను రెండుసార్లు ప్రజల మధ్యనుంచి పార్లమెంట్‌కు పంపిన పార్టీ పట్ల విశ్వాసాన్ని చూపించాల్సిన పద్ధతిలో ఆయన లేరు. అనంతపురం నుంచి వచ్చిన రఘువీరారెడ్డి గానీ, ఆ తర్వాత వచ్చిన శైలజానాథ్ గానీ స్టేట్ లెవల్‌లో జనాన్ని ప్రభావితం చేసే నాయకులు కారు. ఇక రాజమండ్రి నుంచి బయల్దేరి అమలాపురం పార్లమెంట్ సీటు నుంచి రెండుసార్లు ఎన్నికైన జీవీ హర్ష కుమార్ తనకు తాను అతిగా ఫీలవడం తప్ప పార్టీ పట్ల, అధినాయకత్వం పట్ల విశ్వాసం కలిగినవారు కాదు. పీసీసీ ప్రెసిడెంట్‌గా తనను కాదని గిడుగు రుద్రరాజుకు ఇచ్చారని రాహుల్ గాంధీనే విమర్శించారు. ఇక పైసా పెట్టుబడి లేకుండా అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు కేవలం సోనియా దయవల్ల మూడేళ్లుగా ముఖ్యమంత్రిగా వెలగబెట్టి, ఆపై నిస్సిగ్గుగా బీజేపీలోకి వెళ్లిపోయి కూటమి ప్రచండ గాలుల్లో కూడా తన సీటును గెలుచుకోలేకపోయిన కిరణ్‌కుమార్ రెడ్డి కోసం అసలు చెప్పుకోనక్కర్లేదు. ఇక తెలంగాణలో పార్టీ పెట్టి అక్కడ పనవ్వక, ఎటూ పోయే దిక్కులేక షర్మిల ఇప్పుడు మిగిలిన కాంగ్రెస్‌కే నాయకత్వం వహిస్తున్నారనుకుంటే అంతకు ముందు కాంగ్రెస్ నాయకత్వం పట్ల ఆడిన టెంపరి మాటలు విన్నాక ఆమెపట్ల సాధారణ కాంగ్రెస్ సానుభూతిపరులకు ఏమాత్రం నమ్మకం కుదరడంలేదు. పైగా సీబీఐ కేసుల్లో ఇరుక్కుపోయిన అవినీతి సంపద అని చెప్పుకుంటున్నదాన్ని పంచుకోవడంలో అన్నాచెల్లెళ్ల సమస్య రాష్ట్రస్థాయి న్యూసెన్స్‌గా ఉంది. అలాంటి సొంత గొడవల్లో ఇరుక్కుపోయిన మనిషి పీసీసీ అధ్యక్షురాలు కావడం సరి కాదేమోనన్న భావన చాలామందిలో ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా పరిచయమున్న నాయకుడు గానీ, జీరో నుంచి మొదలుపెట్టి రాష్ట్రాన్నంతా చుట్టేసి రాగలిగిన వాగ్ధాటి కలిగిన వ్యక్తి గాని ప్రస్తుత పరిస్థితుల్లో అవసరం. కానీ అలాంటి నాయకత్వం కనుచూపు మేరలో కనిపించడంలేదు. రాష్ట్రంలో ఇతర పార్టీలకు అలాంటి నాయకత్వం ఉందా అంటే.. నాయకుడిగా ముద్రపడిన తర్వాత వాళ్లకు స్టేచర్ పెరగడం తప్ప నిజానికి వారు కూడా అతి సామాన్య మనుషులే. కాంగ్రెస్ అంటే రాష్ట్రాన్ని విడదీసి ఆంధ్రప్రదేశ్‌ను చంపేసిన పార్టీ అంటూ ఒక గొప్ప ముద్ర వాళ్లే వేయించుకున్నారు. అలాంటి అపప్రదను ప్రయత్నంకొద్దీ పొందగలిగిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటే. అదే దాని విశిష్టత. ప్రస్తుత పరిస్థితుల్లో షర్మిలను పార్టీ స్థానం నుంచి తప్పిస్తే, ఆ పదవిని ఎవరికి ఇవ్వాలో తెలియని అయోమయంలో అధినాయకత్వం ఉంటే, అలాంటి పదవిని తీసుకునే నిబద్ధత కలిగిన నాయకుడు ఒక్కడూ లేకుండాపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మౌత్‌పీస్‌గా తిరిగి పార్టీని మార్చగలిగిన ఆ గొప్ప శక్తిమంతుడు ఎవరో కనుచూపు మేరలో కనిపించడంలేదు. ఇతర పార్టీల వైపు చూడనివాడు, పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత కలిగినవాడు, నష్టాలు ఎదురైనా తట్టుకోగలిగినవాడు నేడు కాంగ్రెస్‌కు అవసరం.

• ఎడిటోరియల్

# దగాకోరు బాగోతాలకు అడ్డుకట్ట వేయాలి

ఇన్నాళ్లు డిజిటల్ ఇండియా అంటూ చెప్పుకొచ్చిన ప్రధాని ఇప్పుడు 'మన్‌కీ బాత్'లో డిజిటల్ మోసాల గురించి మాట్లాడటం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రధానమంత్రి చాప కింద నీరులా సమాజాన్ని కబళిస్తున్న ప్రమాదాన్ని గుర్తించడం సంతోషమే. అయినా, వాటిని అరికట్టడానికి తమ సర్కార్ ప్రణాళికలను గురించి మాత్రం ఆయన ప్రస్తావించలేదు. కేవలం కంటి తుడుపు చర్యగా రాష్ట్రాల సహకారంతో దర్యాప్తు సంస్థలు ఈ బెడద నిర్మూలనకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. 'క్షణమాగండి. ఆలోచించండి. ఆ తర్వాతే స్పందించండి'.. అనే మంత్రోపదేశమొకటి చేశారు. నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ వ్యవస్థలో ఎంతో పురోగతిని చూస్తున్నాం. ఇదే సమయంలో సైబర్ నేరగాళ్ల వ్యూహాలూ మారిపోతున్నాయి. రోజుకో కొత్త విధానంతో మోసాలకు తెగబడుతున్నారు. పెరిగిపోతున్న ఈ డిజిటల్ మోసాలపై స్వయంగా ప్రధానమంత్రే ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం 'మన్‌కీ బాత్'లో సైబర్ నేరాల తీవ్రత గురించి ప్రస్తావించారు. వాటిపై ఆందోళన వద్దని, అప్రమత్తతతో ఉంటే చాలని ముక్తాయించారు. అదే సందర్భంలో ప్రధానిగా తమ ప్రభుత్వం ఇలాంటి నేరాల కట్టడికి ఎలాంటి చట్టాలు చేయనుందో ఆయన చెప్పలేదు. నేడు దాదాపు అన్నిరకాల విక్రయ కేంద్రాల్లో, మారుమూల పల్లెల్లో సైతం క్యూఆర్ స్కానర్లు దర్శనమిస్తున్నాయి. సరికొత్తగా భారత్, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్‌ల శీఘ్రతర చెల్లింపు వ్యవస్థల అనుసంధాన ప్రతిపాదనను ఆర్‌బీఐ వెల్లడించింది. ఇదంతా నాణానికి ఒకవైపు. రెండో పార్శ్వం ఆందోళనకర స్థితిగతుల్ని కళ్లకు కడుతోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, ఆర్‌బీఐ లెక్కప్రకారం గత ఐదేళ్లలో నమోదైన దగాకోరు బాగోతాలు ఎకాయెకీ 5లక్షల పైనే. దేశంలో సగటున రోజుకు ఆరువేలకు పైగా సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందుతున్నాయంటున్న ఐ4సీ (ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్) ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 7.4లక్షల కేసులు నమోదైనట్టు ధ్రువీకరిస్తోంది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46 శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్టు గుర్తించారు. ఈ నాలుగు నెలల్లోనే సైబర్ నేరగాళ్లు రూ.1770కోట్ల దాకా కొల్లగొట్టారు. షేర్ ట్రేడింగ్‌లో విపరీత లాభాలొస్తాయంటూ 23 రాష్ట్రాల్లో 168మందికి రూ.22కోట్లకుపైగా టోపీ పెట్టిన గజియాబాద్ గ్యాంగ్ చేతివాటం తాజాగా బట్టబయలైంది. జార్ఖండ్, రాజస్థాన్, హర్యానా, యూపీలలో తిష్టవేసిన సైబర్ ముఠాలే 80శాతం నేరాలకు పాల్పడుతున్నట్టు ఐఐటీ కాన్పూర్ అధ్యయనం ఇటీవలే నిగ్గుతేల్చింది. రోజూ వేలల్లో ఫిర్యాదులు వస్తున్నా విచారణ రేటు స్వల్పంగానే ఉందన్న జాతీయ సైబర్ భద్రతా సమన్వయకర్త, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ రాజేశ్ పంత్ వ్యాఖ్యలు సైబర్ ముష్కరుల కట్టడిలో వ్యవస్థాగత వైఫల్యాన్నే ఎత్తిచూపుతున్నాయి. దేశంలో వచ్చే ఏడాదికి అంతర్జాల వినియోగదారులు 90 కోట్లకు చేరనుండగా ఇప్పటికే మొబైల్ కనెక్షన్ల సంఖ్య 116 కోట్లకు పైబడింది. వినియోగ విస్ఫోటానికి దీటుగా ప్రభుత్వం కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకపోవడంతో తీవ్ర దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. వాటిల్లో పొరుగునున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని కేంద్ర హోంమంత్రిత్వశాఖే వెల్లడించింది. డిజిటల్ భద్రత బీటలు వారకుండా ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోవాలో, ఆన్‌లైన్ మోసానికి గురైతే తక్షణం ఎవరిని ఎలా ఆశ్రయించాలో పౌరులందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నేరగాళ్లు ఎక్కడున్నా సాంకేతిక నిఘా, ఉమ్మడి కార్యాచరణతో ఆన్‌లైన్ నేరగాళ్లకు ఉచ్చు బిగించడం ఎలాగన్న దానిపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలి. ఇటీవల 61 దేశాలకు చెందిన పోలీస్ దళాలు 'ఆపరేషన్ ఫస్ట్ లైట్ 2024' పేరిట చేపట్టిన ఏకోన్ముఖ దాడిలో 4వేల మంది వరకు మోసగాళ్లు పట్టుబడ్డారు. ఆస్ట్రేలియా, జింబాబ్వే వంటి దేశాలు సైబర్ భద్రతకై ప్రత్యేక మంత్రిత్వశాఖనే ఏర్పాటుచేశాయి. ఆయా దేశాల అనుభవాల నుంచి సైబరాసురుల పీచమణచే వ్యూహాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదునుపెట్టాలి. సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వాలు కలిసికట్టుగా ఉక్కుపాదం మోపితేనే, దేశంలో డిజిటల్ చెల్లింపులు సురక్షితమవుతాయి. భవిష్యత్తులో నేరుగా ఇళ్లలోకి చొరబడటం, బీరువాలు బద్దలుకొట్టడం, డబ్బు, బంగారాలు ఎత్తుకుపోవడం వంటి దొంగతనాలు ఉండవు. టెక్నాలజీ పెరిగేకొద్దీ డిజిటల్ మోసాలే ఉంటాయి. మన రాష్ట్రంలో ఇటీవలే దొంగల కదలికలను కనిపెట్టేందుకు ఓ కొత్త సాఫ్ట్‌వేర్‌ను రంగంలోకి తెస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దొంగతనాలు చేసేవారి ముఖాలను అప్‌లోడ్ చేయడం వల్ల వారు ఎటు వెళ్లినా ఎఫ్ఆర్ఎస్ ద్వారా దొరికిపోయే సులభతరమైన టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నారు. కానీ ఇప్పుడు అంతకంటే ముందు కావాల్సింది మోసాలకు అడ్డుకట్ట వేయడం. స్వయంగా ప్రధానే డిజిటిల్ అరెస్ట్ అంటూ ఏమీ ఉండదని పేర్కొనడం ఇందుకు నిదర్శనం.

గబ్బర్‌సింగ్ అనే తెలుగు సినిమాలో విలన్ ఇంటికే వచ్చి బ్రహ్మానందం తొడ గొడతాడు. ఏందిరా నీ బలం అని తనికెళ్ల భరణి అడిగితే.. వెనుకన రిక్షాలో పెట్టుకుని పవన్ కళ్యాణ్ కటౌట్ ఒకటి వచ్చే సీన్ ఉంటుంది.. గుర్తొచ్చిందిగా..? అయితే, ఆ ధైర్యం వెనుక ఆ కటౌట్‌ను చూపించిన ఆ సీన్ సినిమాలోదైతే.. అలాంటి ఓ నిజమైన సీన్ ఓ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్, క్రైమ్ రిపోర్టర్ హుస్సేన్ జైదీకి నిజజీవితంలో అనుభవంలోకి వచ్చిందట. సినిమాలో బ్రహ్మానందం వెనుక పీకే కటౌట్ నిల్చినట్టు.. అప్పుడా జర్నలిస్టును ఆదుకున్నదెవరో ఓసారి చదివేద్దామా..



# పాత్రికేయుడికి ప్రాణభిక్ష పెట్టిన అమితాబ్!

## ఇరాక్‌లో జరిగిన ఆ కథేంటి..?




సద్దాం హుస్సేన్ అంతం తర్వాత ఓసారి హుస్సేన్ జైదీ అనే పాత్రికేయుడు ఇరాక్ రాజధాని బాగ్దాద్‌ను సందర్శించాడు. ఆ సమయంలో హుస్సేన్‌ను కొందరు మిలిటెంట్లు కిడ్నాప్ చేశారు. కళ్లకు గంతలు కట్టి ఎక్కడో తెలియని ఓ కొత్త ప్రదేశానికి తీసుకెళ్లారట. కళ్ల గంతలు విప్పితే.. మన రాంగోపాల్ వర్మ సినిమా తరహాలో చుట్టూ ఎటు చూసినా గడ్డాలతో ఉన్న మనుషులతో భయంకరమైన వాతావరణ కనిపించిందట. కానీ, ఒకే ఒక్క వ్యక్తి మాత్రం క్లీన్ షేవ్‌తో.. వెనుక పెద్ద పెద్ద జులపాలతో 90ల కాలంలోని బాలీవుడ్ హీరోను తలపించేలా కనిపించాడట. ఈ విషయాల్ని హుస్సేన్ 2015లో హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

కట్ చేస్తే.. ఆ బాలీవుడ్ హీరోను పోలిన క్లీన్ షేవర్.. హుస్సేన్ దగ్గరకు వచ్చి నీది పాకిస్థానా అడిగాడట. దానికి, హుస్సేన్ నాది ఇండియా.. నేను హిందీలో మాట్లాడగలనంటూ సమాధానమిచ్చాడట ఆ మిలిటెంట్‌కు. కానీ, తానేమో అరబిక్ మాట్లాడటంతో.. తనకు భాష అర్థంకాని పరిస్థితిలో ఒకవైపు ఒకింత ఆందోళన, మరింత భయం రెండూ ఆవహించాయి హుస్సేన్‌కు. అప్పుడతను మీకు అమీషా బక్కన్ తెలుసా అని అడుగుతున్న దాంట్లో అమీషా బక్కన్ మాత్రమే అర్థమవుతోంది.. కానీ, మిగిలిన అరబిక్ భాష మాత్రం అర్థం కాని పరిస్థితి. దాంతో అప్పటికే అమీషా పటేలే మోనన్న భావనతో.. నాకు అమీషా పటేల్ మాత్రమే తెలుసు గానీ.. అమీషా బక్కన్ తెలియదన్నాడట హుస్సేన్. దాంతో ఆ మిలిటెంట్‌కు చిర్రెత్తుకొచ్చిందట.. ఇండియా అంటున్నావ్.. అమీషా బక్కన్ తెలియదా అంటూ కాస్త గట్టిగా లొల్లి పెట్టాడట. అదే చిరాకుతో లోపలికెళ్లిన మిలిటెంట్.. 1982లో విడుదలైన రమేష్ సిప్పీ తీసిన శక్తి సినిమాలోని పేపర్‌లో వచ్చిన ఓ స్టిల్‌ను తీసుకుని వచ్చాడట. అప్పుడు గానీ.. ఇరాక్‌లో భయంకరమైన మిలిటెంట్ల చేతుల్లో కిడ్నాప్‌కు గురై ఆందోళనలో ఉన్న హుస్సేన్‌కు బల్బ్ వెలిగిందట. వెంటనే ఏస్ నాకు ఈ వ్యక్తి తెలుసు.. అమితాబ్ బచ్చన్ నాకు మంచి స్నేహితుడని చెప్పాడు. దాంతో ఆ మిలిటెంట్ ఓ తెల్లకాగితం మీద తానెప్పుడైనా ముంబై వస్తే.. అమితాబ్ బచ్చన్‌ను కలిపిస్తానని ప్రామిస్ చేయమని ఓ ప్రామిసరీ నోట్ రాయించి వదిలిపెట్టాడట.

అదిగో అలా అమితాబ్.. హుస్సేన్ జైదీ అనే అనే ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ప్రాణాలను కాపాడే విషయంలో పరోక్షంగా తనకు ఉపయోగపడ్డాడు. వినడానికి ఓ పిట్టకథను తలపించినా.. ఈ నిజమైన కథను తానే ఓసారి పంచుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హుస్సేనీ జైదీ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగానే కాకుండా, రచయితగా కూడా సుపరిచితుడు. ది ఏసియన్ ఏజ్, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, మిడ్ డే, ముంబై మిర్రర్ వంటి పత్రికల్లో సయ్యద్ హుస్సేన్ జైదీ రాసిన క్రైమ్ స్టోరీస్, ఇన్వెస్టిగేటివ్ స్టోరీస్ ఆయన కెరీర్‌లో మైల్ స్టోన్స్‌గా మిగిలాయి. అలాగే, డోంగ్రీ టూ దుబాయ్– సిక్స్ డికేడ్స్ ఆఫ్ ది ముంబై మాఫియా, మాఫియా క్వీన్స్ ఆఫ్ ముంబై, బ్లాక్ ఫ్రైడే, ముంబై అవేంజర్స్, మై నేమ్ ఈజ్ అబూసలేం వంటి బుక్స్ రాశాడు. ముఖ్యంగా ఇతని రచనలన్నీ ముంబైలోని అండర్ వరల్డ్ బేస్డ్‌గా సాగాయి. టెర్రర్ ఇన్ ముంబై వంటి హెచ్‌బీవోలో వచ్చిన డాక్యుమెంటరీకి జైదీ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరించాడు. జైదీ ముంబై అవేంజర్స్‌ను బేస్ చేసుకునే కబీర్ ఖాన్.. ఫాంటమ్ సినిమా రూపొందించాడు. ఇలా పలు సినిమా ప్రొడక్షన్ హౌజెస్‌తోనూ, బాలీవుడ్ ప్రముఖులతోనూ మంచి సంబంధాలున్న సయ్యద్ హుస్సేన్ జైదీ ప్రాణాలతో బయటపడటానికి మాత్రం అదే బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ పరోక్షంగా ఉపయోగపడటం ఆయన జీవితంలో ఓ మరపురాని జ్ఞాపకమైపోయింది.

- రమణ కొంటికర్ల



మా పక్కింటి వాళ్లబ్బాయి పెళ్లి చూపులకి వెళ్లి వచ్చాడు. 'ఏరా అమ్మాయి నచ్చిందా?' అని అడిగితే 'నచ్చింది' అని సమాధానం ఇచ్చాడు. 'మరి సంబంధం ఎందుకు వద్దంటున్నావు' అని అడిగితే, 'ఆ అమ్మాయి పేరు సూర్యకాంతం. అందుకే వద్దంటున్నాను' అన్నాడు. అదీ ఆ పేరుకున్న పవర్. అదీ ఆ పేరుకున్న ప్రత్యేకత. అదీ ఆ పేరుకున్న భయం. ఈ ప్రపంచం లోనే పేరుతో భయపెట్టిన ఏకైక వ్యక్తి సూర్యకాంతం అనుకోవచ్చు. సూర్యకాంతి.. ప్రాణులకు జీవనాధారం. ఒక్కరోజు సూర్యుడు రాకపోయినా మానవాళి మనుగడ కష్టమే. సూర్యకాంతం సినిమా ప్రపంచానికి జీవనాధారం. ఒక్కరోజు ఒక్క సినిమాలో సూర్యకాంతం కనిపించకపోయినా సినిమా మనుగడ కష్టమే. ఆవిడకు నటించటం చేతకాదు. మాట్లాడటం చేతకాదు. ఆ పాత్రే తాను అయిపోవడం మాత్రమే వచ్చు. గయ్యాళి అత్తగారుగా సుమారు యాభై సంవత్సరాలు కోడళ్లను భయపెట్టారు. బాబోయ్ అత్తగారంటే ఇంత దారుణమా అనిపించారు. సూర్యకాంతం అనే అందమైన పేరుని తమ ఇంటి ఆడపిల్లలకు పెట్టుకుందాం అనుకోగానే 'అమ్మో! ఆ పేరు వద్దులే' అని వెనక్కు తగ్గేంత ఘనకీర్తి సంపాదించారు ఆ పేరుకి. ఆ పేరును తన సొంతం చేసుకున్నారు ఎడమచేతి వాటం అత్తగారు. బహుశః ప్రపంచంలో ఈ ఘనత దక్కించుకున్న ఏకైక నటీమణి అయి ఉండచ్చు. సూర్యకాంతం జీవితంలోకి సన్నిహితంగా తొంగి చూసినవారు, ఆవిడ గయ్యాళి కాదు, మేలిమి బంగారమని ఎన్నో సందర్భాలలో వేదికలమీద గట్టిగానే చెప్పారు. అంత మంచిగా మెలగడం వల్లనే ఆవిడ కష్టనష్టాలను ఎదుర్కొన్నారని... ఆవిడలోని మాతృ మాధుర్యాన్ని అనుభూతి చెందినవారు అంటారు.

# సూర్యకాంతం... పేరులోనే పవరుంది?

## వెండితెరపై బంగారు కాంతులు...

సూర్యకాంతానికి ఆరేళ్ల వయస్సులోనే తండ్రి చనిపోవడంతో, కొన్నాళ్లు పెద్దక్కబావల దగ్గర పెరిగారు. సూర్యకాంతం చిన్నతనంలో చాలా తుంటరిగా, అల్లరి పనులు చేసేవారు. అందువల్లనో ఏమో చదువు పెద్దగా ఒంట పట్టలేదు. అప్పటికే సినిమాల మీద తరగని వ్యామోహం కలిగింది. సినిమాకి వెళ్లకపోతే తోచేది కాదు. ఆవిడ నివసించే పల్లెటూరి నుంచి కాకినాడకు ఎడ్లబండిలో వచ్చి పృధ్వీరాజ్ కపూర్ నటించిన హిందీ చిత్రాలు చూశారు. ఆవిడకు సినిమాలంటే ఉన్న వ్యామోహం తల్లి గమనించారు. పెద్దక్క ఒప్పుకోకపోయినా, తల్లితో కలిసి మద్రాసు చేరుకున్నారు. నారదనారది (1946) లో మొట్టమొదటగా వెండితెర మీద కనిపించారు. మొదట్లో నాయిక పాత్రలు ధరించాలనుకున్నారు. కాని ఒకసారి హఠాత్తుగా పడిపోవటంతో, మహోక్కు మీద మచ్చ పడింది. క్లోజప్‌లో మచ్చ కనపడుతుంది కాబట్టి ఇక నాయిక పాత్రలకు పనికిరానని నిర్ణయించుకుని, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారిపోయారు. 1962లో విడుదలైన 'గుండమ్మ కథ' చిత్రంతో సూర్యకాంతం గయ్యాళి పాత్రలకు చిరునామాగా మారిపోయారు. సూర్యకాంతానికి ఒక్కసారి డైలాగ్ వింటే చాలు వెంటనే వచ్చేసేది. ఒకే టేక్‌లో ఓకే అయిపోయేది. డైలాగ్ పలకడంలో విచిత్రమైన మాట విరుపు, ఎడమ చేతివాటం... ఈ రెండు ప్రత్యేకతలూ ఆవిడను గొప్ప నటిని చేశాయి.

### క్షమాగుణం

శత్రువు ఇంటికి వచ్చినా వాళ్లని క్షమించి, వాళ్లకి అన్నం పెట్టేవారు. పచ్చళ్లు, దోస ఆవకాయ అంటే ఆవిడకు ఇష్టం. వంటల మీద పుస్తకం వేశారు.. లైట్ కలర్స్ బాగా ఇష్టపడేవారు. నలుపు రంగంటే అస్సలు ఇష్టపడేవారు కాదు. కారు కొన్నప్పుడు లైట్ బ్లూ బుక్ చేస్తే, వాళ్లు బ్లాక్ కలర్ ఇచ్చారు. అప్పుడు గొడవ పెట్టి, మార్చుకున్నారు. ఆవిడకు డ్రైవింగ్ అంటే ఇష్టం. తన కారు తనే డ్రైవ్ చేసుకునేవారు.

### జిహ్వాపై భాషల నాట్యం...

స్కూల్ చదువులు పెద్దగా చదువుకోలేదన్న మాటే గానీ, సూర్యకాంతం పది భాషలు సులువుగా మాట్లాడగలరు. మద్రాసు వచ్చాక ఇంగ్లీషు, 50 ఏళ్ల వయస్సులో ఫ్రెంచ్ నేర్చుకున్నారు. బెంగాలీ భాష అంటే ఆవిడకు చాలా ఇష్టం.

### చిన్నతనంలోనే...

కాకినాడ సమీపంలో ఉన్న వెంకటరాయపురం ఆవిడ పుట్టిల్లు. సూర్యకాంతానికి కన్న సంతానం లేదు. అందువల్ల తన అక్క కుమారుడిని రోజుల పిల్లాడిగా ఉన్నప్పుడే దత్తతు తీసుకుని, మద్రాసులోనే బారసాల చేశారు. తన తండ్రిగారిని ఆ పిల్లవాడిలో చూసుకోవాలనే ఉద్దేశంతో 'అనంత పద్మనాభమూర్తి' అని పేరు పెట్టి, ఆ పిల్లవాడిని "నాన్నా!' 'నానీ!' అని పిలుచుకునేవారు. సూర్యకాంతం బావగారి పేరు పెద్దిభొట్ల వెంకట చలపతిరావు. అక్కగారి పేరు సత్యవతి. ఆ ఇంటి పేరును నిలపడం కోసం 'దిట్టకవి' ఇంటి పేరునే తన దత్తపుత్రుడికి కొనసాగించారు. ఆ పిల్లవాడిని కారులోనే స్కూల్‌కి పంపేవారు. డ్రైవర్ రాకపోతే ఇంట్లో పనివాళ్లు సైకిల్ మీద స్కూల్‌లో దింపేవారు. ఆ స్కూల్‌లో ఒక ల్యాబ్ కట్టడానికి ఆ రోజుల్లోనే సూర్యకాంతం పదిహేను వేల రూపాయలు డొనేషన్ ఇచ్చారు. ఎక్కడకు వెళ్లినా, కుమారుడిని తన వెంటే తీసుకువెళ్లటం ఆవిడకు అలవాటు. పిల్లవాడికి అనారోగ్యం చేస్తే, పక్కనే కూర్చుని, ఎందరో దేవుళ్లకు మొక్కులు మొక్కేవారు. దేవాలయాలకు వెళ్లినప్పుడు హుండీలో పిల్లవాడి చేత డబ్బులు వేయించి, అర్చనలు చేయించేవారు. అనంతపద్మనాభమూర్తిని ఎం.కామ్ వరకు చదివించారు. చదువు పూర్తయ్యాక కెనరా బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. కాని దూరమని పంపలేదు. ఆ తరవాత చెన్నై మైలాపూర్ ఆంధ్ర బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. దగ్గరగా ఉండటంతో ఉద్యోగంలో చేరటానికి అనుమతి ఇచ్చారు సూర్యకాంతం. సూర్యకాంతానికి తెలుగు భాష మీద మక్కువ ఎక్కువ. అబ్బాయికి ఆవిడే స్వయంగా తెలుగు నేర్పారు. అన్నిరకాల పుస్తకాలు కొని తాను చదివాక, అబ్బాయి చేత చదివించేవారు. మూస ధోరణిలో చదువుతుంటే, ఆడ మగ గొంతు మార్చి చదివితేనే బాగుంటుందని, భావయుక్తంగా చదివించేవారు. అలా చదవటం వల్ల కథ మనసుకి పట్టడమే కాకుండా, గుర్తుండిపోతుందని అనేవారు.

### పిరికితనమే ఎక్కువ

**సూర్యకాంతం అందరినీ వరసలతో పిలిచేవారు. అందరినీ చాలా అభిమానించేవారు. వారికి ఏదైనా అవుతుందేమోనని భయం ఎక్కువగా ఉండేది. జగపతి పిక్చర్స్ అధినేత వి.బి. రాజేంద్రప్రసాద్‌గారికి యాక్సిడెంట్ అయినప్పుడు ఆయన త్వరగా కోలుకోవాలని మొక్కుకున్నారు సూర్యకాంతం. ఆయనకు తగ్గాక అందరికీ భోజనాలు పెట్టారు. అంతటి సున్నిత మనస్కురాలు సూర్యకాంతం. అంతేకాదు ఎవరికి ఒంట్లో బావుంకడపోయినా, వాళ్ల తరపున మొక్కులు తీర్చేవారు. వారి గోత్రం తెలియకపోతే, దేవుడి గోత్రం, నక్షత్రం చెప్పి పూజలు చేయించేవారు.**

### నోరూరే మహిమాన్విత వంటలు..

సూర్యకాంతం చేతి వంట అమృతంలా ఉండేదనుకునేవారు సినిమా వారంతా. ఆవిడకు బయట తినే అలవాటు లేదు. అందుకే షూటింగులకు వెళ్లేటప్పుడు తనకు మాత్రమే కాకుండా, షూటింగ్‌లో ఉన్న మిగతా వాళ్ల కోసం వంట చేసి తీసుకువెళ్లేవారు. ఆవిడ రాక కోసం అందరూ ఎదురు చూసేవారు. ఎన్‌టిఆర్, 'అక్కయ్యగారూ! ఏం తెచ్చారు?' అని అడిగి మరీ తినేవారు.

తెల్లవారుజామునే నిద్రలేవడం, పూజ చేసుకోవడం, వంట పూర్తి చేసి, ఇంట్లో వారికోసం క్యారేజీలు పెట్టి, తన కోసం సిద్ధం చేసుకున్న క్యారేజీలతో షూటింగ్‌కు వెళ్లడం ఆవిద దినచర్య. పొద్దున్నపూట టిఫిన్ కాకుండా, పెరుగన్నమే తినాలి. కుమారుడు పదవీ విరమణ చేసేవరకూ ఉదయం పెరుగన్నమే పెట్టారు సూర్యకాంతం. ఇంటికి ఎవరు వచ్చినా 'మజ్జిగ తాగుతారా! అన్నం తింటారా!' అని అడిగేవారు. కాఫీ టిఫిన్లు ఇచ్చేవారు కాదు. బంధువుల కోసం నిమిషాల్లో ఏదో ఒక ప్రత్యేక వంటకం తయారుచేసేవారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోజుల్లో కూడా చక్కని ఆతిథ్యం ఇచ్చేవారని పలువురు ప్రముఖులు తరచుగా అనేవారు. ఉన్నంతలో దాన ధర్మాలు చేయటం ఆవిడకు అలవాటు.

### నెయ్యి లేకుండా భోజనమా!!!

ఇంట్లో అందరితో కలిసి భోజనం చేయటమంటే అత్యం ప్రీతి సూర్యకాంతానికి. షూటింగ్ ఇబ్బందులు లేకప్పుడు అందరితో కలిసి భోజనం చేసేవారు. ఒక్కోసారి ఆవిడ వండుకున్న కూర ఆవిడకి నచ్చేది కాదు. వెంటనే 'నాన్నా! నెయ్యి వేసి మాగాయి అన్నం కలిపి పెట్టనా' అని, పిల్లవాడికి తినిపించేవారట. ఆవకాయ, మాగాయి అన్నంలోకి నెయ్యి కలుపుకుని తినటం ఆవిడకు చాలా ఇష్టం. జీవితంలో ఒక్కరోజు కూడా నెయ్యి లేకుండా అన్నం తినేవారు కాదట. ఎన్ని మానేసినా, నెయ్యి మాత్రం మానలేదట. ఆవిడకు స్వీట్లంటే పెద్దగా ఇష్టం లేదు. ఇంటి మొత్తానికి ఒక్క ఏసీనే ఉండేది. ఆ గదిలోనే అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. అనంత పద్మనాభమూర్తి వివాహం సూర్యకాంతం స్వయంగా కుదిర్చారు. కోడలి పేరు ఈశ్వరిరాణి. ఇద్దరు మనవలు. అబ్బాయి సూర్య సత్య వెంకట బాల సుబ్రహ్మణ్యం, చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. అమ్మాయి జయలక్ష్మి ఎంబిఏ చదివి, గీతమ్ యూనివర్సిటీలో పిహెచ్‌డి చేశారు.. ఆవిడ చాలా సింపుల్. జనసమ్మర్దంలోకి వెళ్లాలంటే ఆవిడకు చాలా భయం. అప్పట్లో సినిమా వారంతా టి నగర్‌లో ఉంటే, సూర్యకాంతం మాత్రం సిఐటీ కాలనీలో ఉండేవారు.

### ముగింపు వాక్యం

1994లో సూర్యకాంతం కన్నుమూశారు. సూర్యకాంతాన్ని పద్మ పురస్కారాలు వరించకపోయినా, తెలుగు ప్రేక్షకులు అంతకంటే గొప్ప కీర్తిప్రతిష్టలతో ఆమెను వారివారి హృదయ పద్మాలలో భద్రపరచుకున్నారు. అనునిత్యం ఆ పద్మాలను కరకమలాలతో ధ్యానిస్తున్నారు.

- డా. వైజయంతి పురాణపండ

## జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలకి ఎంపికైన జిల్లాకు చెందిన క్రీడాకారులను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా అభినందించారు. విజేతలుగా తిరిగిరావాలని ఆయన ఆకాంక్షించారు. ఇటీవల నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్‌జిఎఫ్ ఫెన్సింగ్ పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎల్.డార్విన్, పి.ఆమనీలను అసోసియేషన్ తరపున మంగళవారం అభినందించారు. అండర్-17 విభాగంలో ఇప్పి, ఇండివిద్యువల్ ఈవెంట్‌లో కరకవలస జడ్పీ హైస్కూల్‌కి చెందిన ఎల్.డార్విన్, అండర్-17 సాబర్ ఇండివిద్యువల్ ఈవెంట్‌లో సతివాడ జడ్పీ హైస్కూల్‌కి చెందిన పి.ఆమనిలు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. వారిద్దరిని ఫెన్సింగ్ అసోసియేషన్ తరపున జిల్లా అధ్యక్షుడు రాజా అభినందించారు. వారికి శిక్షణ ఇచ్చిన ఎన్ఐసి ఫెన్సింగ్ కోచ్ వంశీని అభినందించారు. వచ్చే నెల 17 నుంచి జమ్ముకాశ్మీర్‌లో జాతీయ ఫెన్సింగ్ పోటీలు జరుగనుండగా, ఈ 15న జిల్లా క్రీడాకారులు బయలుదేరి అక్కడకు వెళ్లనున్నారు. క్రీడాకారులను అభినందించే కార్యక్రమంలో కోచ్ వంశీతో పాటు పీడీలు భవానీ, డి.యశోద, అనితశ్రీ, పి.రాములమ్మ, రాహుల్ పాల్గొన్నారు.



మత్తు పదార్థాలు, వాటి వల్ల కలిగే నష్టాలు గురించి పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ వివరించారు. విద్యార్థులందరూ మత్తు పదార్థ వ్యతిరేక నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అనంత్, బౌరోతు శంకర్రావు, నారాయణరావు, బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, పాలకొండ



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

(సత్యంన్యూస్, నరసన్నపేట)

జలుమూరు మండలం లింగాన్నాయుడుపేట గ్రామానికి చెందిన ధర్మాన భానుప్రసాద్‌కు అనారోగ్యం కారణంగా ఆయన చేసుకున్న దరఖాస్తు మేరకు రూ.1,77,637 సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయింది. ఈమేరకు లబ్ధిదారునికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చెక్కును మంగళవారం అందించారు.

## టీడీపీ సభ్యత్వంతో గౌరవం


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం సమాజంలో గొప్ప గౌరవం, గుర్తింపు లభిస్తుందని శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. మంగళవారం 41వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు, రెన్యువల్ కార్యక్రమం డివిజన్ ఇన్చార్జి చిన్నిపిల్లి మణికంఠ, 40వ డివిజన్ ఇన్చార్జి మైలపల్లి రాజు, టిడిపి నాయకులు, మైలపల్లి నరసింహమూర్తి, మాడుగుల చంద్రశేఖర్ (బుజ్జి), బాబ్జీ, ప్రవీణ్, కొమర మురళీ, బాల, యువత, ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని, పార్టీ సభ్యత్వం ద్వారా ఆర్థిక భరోసాకు నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వెంకటేష్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎన్ని అవమానాలు, ఆటుపోట్లు, ఇబ్బందులు ఎదురైనా నిరంతరం తెలుగుజాతి, రాష్ట్రాభివృద్ధికి నిత్యం పోరాడుతూ అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ రాష్ట్రాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజానీకానికి బాసటగా నిలిచిందన్నారు. ప్రతిఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకొని తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి, పార్టీ ఆశయాలు సిద్ధాంతాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందే విధంగా సహకరించాలని వెంకటేష్ కోరారు. ఆయనతో పాటు పలువురు కూటమి నాయకులు ఉన్నారు.



## శ్రీ వారాహిమాతకు అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



తెలంగాణ రాష్ట్రంలోని దిల్‌సుఖ్‌నగర్‌కు దగ్గరలో గల కొత్తపేటలో ఉన్న 50 ఏళ్ల క్రితం నాటి శ్రీ వారాహి ప్రత్యంగిరా దేవి పీఠంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయరచనగా జయహో శ్రీ జగజ్జనని అనే 108 పుస్తకాలతో విశ్వ జయము గ్రూప్ సభ్యుల శ్రేయస్సుకు శ్రీ వారాహి మాతకు అర్చన జరిపించి వాటిని భక్తులకు వితరణ చేయాలని ఆలయ చైర్మన్ ఎం.భాస్కరశర్మకు అందజేశారు. ఈ పుస్తకంలో సప్తమాతృకలు, నవదుర్గలు, దశ మహా విద్యలకు గల చరిత్రలను, వారికి చెందిన 108 సుప్రసిద్ధమైన ఆలయాల విశేషాలను, వారి ఆరాధనా స్తోత్రాలను పొంజుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ ములుగు రజనీ, అనంత శర్మ, సంతోష్ శర్మ, రవిశర్మ, రాంబాబులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

జిల్లాలో పెద్దఎత్తున చేపడుతున్న మెటీరియల్ కాంపోనెంట్ పనులైన సిమెంట్ రహదారులు, సిమెంట్ కాంక్రీట్ కాలువల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాల్సిందేనని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. సోమవారం కిష్టప్పపేట గ్రామంలో జరుగుతున్న కాంక్రీట్ రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు జరుగుతున్న సమయంలో ప్రత్యక్ష పరిశీలన, పర్యవేక్షణ చేయాలని, నిబంధనల మేరకు నాణ్యతను పాటించాలని ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం విధులతో చేపడుతున్న రహదారులు, కాలువల పనులతో పాటు ఇతర పనుల వలన గ్రామాల్లో శతశాతం మెరుగైన సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నట్లు పీడీ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంట ఏపీవో సీతారాం, ఈసీ బాలముకుంద బాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల కోసం పోరాడిన యోధుడు సుందరయ్య

### - స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో విగ్రహావిష్కరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజల కోసం జ్వలించి కమ్యూనిస్టు గాంధీగా పేరుగాంచిన పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తి చిరస్మరణీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, దక్షిణాభారత కమ్యూనిస్టు గాంధీగా పేరుగాంచిన పుచ్చలపల్లి సుందరయ్య నూతన విగ్రహాన్ని నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో సీపీఎం నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజా సంఘాల ప్రతినిధులు సమక్షంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో గాంధీజీ పిలుపునందుకొని పోరాట బాట పట్టిన సుందరయ్య కమ్యూనిస్టు భావజాలంతో అణగారిన ప్రజల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సమాజం కోసం పనిచేసే ఎవరైనా సుందరయ్య స్ఫూర్తిని ఆకళింపు చేసుకొని ముందుకు సాగాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర సభ్యులు బెండి తులసీదాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో మహనీయులు సరసన అత్యంత ప్రతిభావంతమైన వ్యక్తి సుందరయ్య విగ్రహం ప్రతిష్టించడం అభినందనీయమన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సమరయోధులు,సంఘ సంస్కర్తల స్మృతివనం తనకెంతో స్ఫూర్తిని కలిగించిందన్నారు. సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు స్ఫూర్తిని అణువణువున నింపుకొని జీవన విధానంగా మలుచుకున్న పుచ్చలపల్లి సుందరయ్య నిత్య స్మరణీయులని కొనియాడారు. అనంతరం విగ్రహదాత వి.జి.కె.మూర్తి, శిల్పి దివిలి హేమచంద్రలను సత్కరించారు. గాంధీ మందిర ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, నటుకుల మోహన్ బృందం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరించారు. అవధాన పండితులు పైడి హరనాధరావు పుచ్చలపల్లి సుందరయ్య కీర్తిని గానం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు బవిరి కృష్ణమూర్తి, డి.గోవిందరావు, కె.శ్రీనివాస్, వై.చలపతిరావు, కె.మోహన్‌రావు, కొత్తకోట అప్పారావు, కె.నాగమణి, మహాలక్ష్మి, డబ్బీరు గోవింద్, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, మహిబుల్లా ఖాన్, కొమ్ము రమణమూర్తి, పందిరి అప్పారావు, మెట్ట అనంతంభట్లు తదితరులు ఉన్నారు.

## సమాజ సేవకుడు రాజుకు సన్మానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



సమాజ సేవాతత్పరుడు, కేజిఎఫ్ అధ్యక్షుడు సపకతక్రా క్రీడా శ్రీకాకుళం జిల్లా శాఖ కోశాధికారి బి.వి.ఎస్.ఎన్. రాజు, పలువురు సంఘ సభ్యులను ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం స్థానిక ఎస్‌వీడీ హోటల్ ప్రత్యేక అతిధి మందిరంలో జరిగింది. ఈ నెల 22, 23 తేదీల్లో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ ఆట స్థలం శ్రీకాకుళంలో సెపక్‌తక్రా శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 34వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీ కార్యక్రమం వైభవంగా నిర్వహించబడిన విషయం విధితమే. ఈ పోటీలు పూర్తిగా జిల్లా సపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఇదిలా ఉండగా ఈ పోటీల్లో మహిళ జట్టు గోల్డ్‌మెడల్ సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, పురుషుల జట్టు బ్రాంచ్ సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎస్వీడీ హోటల్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘ సభ్యులకు క్రీడాకారుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, సెక్రటరీ గాలి అర్జున్‌రావు రెడ్డిలతో సన్మానాలు అందుకున్న వారిలో ఉపాధ్యక్షులు ఎస్‌వీడీ మురళీ, జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షులు, న్యూ సెంట్రల్ స్కూల్ అధినేత శ్రీకాంత్, మానస శ్రీను, ట్రాఫిక్ జామ్ శ్రీను, విష్ణుమూర్తి, నక్క శంకర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సపక్‌తక్రా జిల్లా శాఖ జాయింట్ సెక్రటరీ గాలి వేణుగోపాలరావు రెడ్డి, సభ్యులు బాలు, జిల్లా మేనేజర్ బాబ్జి, పలువురు క్రీడాకారులు ఉన్నారు.

## మాజీ సైనికులకు రాష్ట్రంలో ఒకే అసోసియేషన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




రాష్ట్రంలో మాజీ సైనికులకు ఒకే అసోసియేషన్ ఉండాలని శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం అన్నారు. ఇటీవల కడపలో జరిగిన రాష్ట్ర మాజీ సైనికుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే రాష్ట్రం ఒకే సంఘం నినాదంతో రాష్ట్ర స్థాయి మాజీ సైనికుల రెండవ సమావేశంలో డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ తరపున ఆయన శ్రీకాకుళం వాయిస్‌ని రాష్ట్రంలో వినిపించారు. మాజీ సైనికులను ఒకే తాటిపైకి తెచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యలపై అడిగే ఒక గలం అవసరమని సభకు వివరించారు. దీనికి రాష్ట్రంలో 70 శాతం నాయకులు ఏకీభవిస్తూ మేదోమధనం జరుగుతుందని, దీనికి నాందిగా ఇటీవల వైజాగ్‌లో, ఇప్పుడు కడపలో, రాబోయే రోజుల్లో మంగళగిరిలో.. 26 జిల్లాల నుంచి అందరినీ కలుపుకుంటూ వెళుతున్నామని వివరించారు. అయితే ఇటీవల ఈ సమావేశాలకు రాజకీయ రంగులు పులుముతూ తమ ఆశయాన్ని భంగం కలిగించి పబ్బం గడుపుకునేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని, వారి పప్పులు ఇక ఉడకవని ఎద్దేవా చేశారు. ఆయనకు మద్దతుగా పలాస మాజీ సైనికుల ప్రెసిడెంట్ ఐ.ఎమ్.రావు, విజయ నగరం నుంచి మాజీ సైనికుల నేతాజీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పి.మన్మధరావు, ఉత్తరాంధ్ర మాజీ సైనికుల ప్రెసిడెంట్ చిల్లా వెంకటరెడ్డి, స్టేట్ నేవీ అసోసియేషన్ ఫౌండర్ డాక్టర్ శివ కుమార్, కాకినాడ మాజీ సైనికుల అధ్యక్షులు అడపా శంకర్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## సీఎం రాకకు ఏర్పాట్లు పరిశీలన



(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నవంబర్ ఒకటో తేదీన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌లు సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల్లో కొర్లాం, ఈదుపురం, పద్మతుల గ్రామాలను సోమవారం సందర్శించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి జిల్లాకు చంద్రబాబు వస్తున్నారు. దీపావళి సందర్భంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను అందజేసే కార్యక్రమాన్ని ఆయన జిల్లా నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా రెండవ అతి పెద్ద కార్యక్రమాన్ని జిల్లా నుంచే ప్రారంభించనుండటంతో దీన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏ గ్రామం అనుకూలంగా ఉంటుందనే విషయమై అధికారులంతా ఆయా గ్రామాల్లో కలియతిరిగారు. హెలీ ప్యాడ్ ఏర్పాటు నుంచి బహిరంగ సభకు అనువైన ప్రాంతాలు, పార్కింగ్ తదితర అంశాలను వారు పరిశీలించారు. ఆర్డీవో, ఆయా మండలాల తహసిల్దార్లు, అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

























# అదే పద్ధతి.. అదే అరాచకం!

(మొదటిపేజీ తరువాయి)

మరో సంస్థ వచ్చింది. వాస్తవానికి గత ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు విశ్వసముద్రకు 2025 మార్చి వరకు అగ్రిమెంట్ ఉందని కొందరు, లేదూ ఆగస్టు వరకు ఉందని మరికొందరు చెబుతున్నారు. అయితే ప్రభుత్వమే విశ్వసముద్రను ఈ బాధ్యతల నుంచి తప్పుకోమన్న తర్వాత సీనరేజ్ వసూలుచేయడం కష్టమవుతుందని భావించి, తనకు బదులుగా ఏఎమ్మార్ అనే సంస్థను తెర మీదకు తెచ్చినట్లు తెలుస్తుంది. గత లెక్కల ప్రకారం నెలకు దాదాపు రూ.13 కోట్లు (జీఎస్టీతో కలుపుకొని) ప్రభుత్వానికి చెల్లించి, ఆ మేరకు జిల్లాలో మైనింగ్ పర్మిట్లు ఇచ్చి సీనరేజ్ వసూలు చేసుకోడానికి విశ్వసముద్ర ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇందులో ఎన్ని నెలలు విశ్వసముద్ర ప్రభుత్వానికి ఒప్పందం మేరకు సొమ్ములు చెల్లించింది, ఇంకా ఎంత బకాయి ఉందన్న లెక్కలు పబ్లిక్ డొమైన్‌లో కనిపించడంలేదు. జిల్లాలో సీనరేజ్ వసూలుతో పాటు మూలపేట పోర్టు పనులను కూడా విశ్వసముద్రే దక్కించుకుంది. సముద్రంలో బ్యాక్ వాటర్స్ కోసం జిల్లాలో అనేక కొండలను ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వేసి, ఆ రాళ్లతో పోర్టు బ్యాక్‌వాటర్స్ పనులు పూర్తి చేసింది. ఇందుకు సంబంధించి ఎంత రాయల్టీ చెల్లించారు, ఎన్ని కొండలకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారన్న లెక్కలేవీ అప్పటి ప్రభుత్వం వద్ద లేవు, ఇప్పటి ప్రభుత్వంలో ఎవరూ అడగడంలేదు. కేవలం విశ్వసముద్ర జిల్లాలో రాయల్టీ వసూలు చేయడం వల్ల ప్రతీ నియోజకవర్గంలోనూ కనీసం 5వేల ఓట్లు వైకాపాకు మైనస్ అవుతాయన్న భావన అప్పట్లో అందరు ఎమ్మెల్యేలు వ్యక్తం చేసినా జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. ఇప్పుడు విశ్వసముద్ర ఏ పనైతే చేసిందో, అదే పనిని చేయడానికి ఏఎమ్మార్ అనే సంస్థను తెచ్చి ఇక్కడ పెట్టారు. వీరికి, ప్రభుత్వానికి మధ్య ఏమేరకు ఒప్పందం జరిగిందన్న పత్రాలు చూపించడంలేదు కానీ, సీనరేజ్ మాత్రం వసూలు చేస్తున్నారు. అసలు మీకు సీనరేజ్ వసూలు చేయడానికి ఉన్న అధికారమేమిటి, హక్కు ఎవరిచ్చారని ప్రశ్నిస్తే ఎదురుతిరగడం తప్ప దీనికి సమాధానం చెప్పడంలేదు. గతంలో సీనరేజ్ వసూలు చేయడానికి విశ్వసముద్ర ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బిల్లులు ఇచ్చేది. కానీ ఏఎమ్మార్ మాత్రం సొమ్ములు తీసుకొని ఎందుకూ పనికిరాని ఓ చిత్తుకాగితాన్ని ఇస్తుంది. ఇటీవల పొందూరు మండలం రాపాక నుంచి వెళ్తున్న మెటల్‌కు సీనరేజ్ వసూలు చేస్తూ ఇలాగే ఓ చిత్తుకాగితం ఇవ్వడంతో ఇప్పుడది జిల్లా వ్యాప్తంగా వివాదాస్పదమైంది. అక్రమంగా తవ్వుతున్న క్వారీలు, క్రషర్లను ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలిస్తే తామేమీ అక్రమంగా తవ్వడంలేదని, సీనరేజ్ కడుతున్నామంటూ ఓ చిత్తుకాగితాన్ని రాపాక క్వారీ యజమానులు చూపించారు. వాస్తవానికి దీనికి ఎటువంటి చెల్లుబాటూ లేదు. ఇది తెలుసుకున్న క్వారీ యజమానులు ఆ మరుసటి రోజు నుంచి ఏఎమ్మార్‌కు ప్రభుత్వంతో కుదిరిన ఒప్పంద పత్రం చూపిస్తేనే సీనరేజ్ చెల్లిస్తామని తేల్చి చెప్పారు. ఇది జరిగి 15 రోజులవుతున్నా ఏఎమ్మార్ సంస్థ ఎటువంటి ధ్రువపత్రాన్ని చూపించలేకపోయింది. దీంతో విజిలెన్స్ అధికారులు కూడా అటువైపు దృష్టి సారించాల్సి వచ్చింది. జిల్లాలో దాదాపు 105 క్రషర్లు ఉన్నాయి. ఇందులో 20 క్రషర్లకు మాత్రమే పర్యావరణ శాఖ, పొల్యూషన్ శాఖ అనుమతులు తీసుకున్న క్వారీలు (కొండలు) ఉన్నాయి. ఇలా అనుమతులు తీసుకున్నందుకు ఒక క్యూబిక్ మీటరు రాయిని తీసుకొని క్వారీకి తరలించడానికి ప్రభుత్వానికి వీరు సొమ్ములు చెల్లిస్తుంటారు. కానీ ఇప్పుడు ఏఎమ్మార్ లేదా అంతకు ముందు విశ్వసముద్ర సంస్థలు తమ వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం లీగల్, ఇల్లీగల్ మైనింగ్ రెండింటినీ ఒకే గాటన కట్టి సీనరేజ్‌ను వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న తమకు సీనరేజ్ వసూళ్లలో రాయితీ ఇవ్వాలని క్రషర్ యజమానులు నాలుగు రోజుల క్రితం ఏఎమ్మార్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడినా అందుకు సమ్మతించలేదని భోగట్టా. మరోవైపు ఏఎమ్మార్ సంస్థకు సీనరేజ్ వసూలు చేసే అధికారం లేదంటూ ఎటువంటి అనుమతులు లేని కొందరు ఎంచక్కా మెటల్‌ను తరలించుకుపోతున్నారు. వాస్తవానికి ఇల్లీగల్ మైనింగ్ చేస్తున్న వారి నుంచి కూడా ఆన్‌లైన్ బిల్లు జనరేట్ చేసి, ఆ సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తేనే ప్రైవేటీకరణకు ఫలితముంటుంది. అలా కాకుండా అనుమతులు ఉన్నవారి క్వారీల నుంచి వసూలు చేస్తున్నది మాత్రమే ప్రభుత్వానికి చూపించి అనధికారిక తరలింపునకు మాన్యువల్ బిల్లులు ఇచ్చి, ఆ సొమ్మును సంబంధిత సంస్థలు తమ సొంత ఖాతాలో వేసుకుంటున్నాయి. అటువంటప్పుడు కోట్ల రూపాయలు వసూలుచేసి ప్రైవేటు సంస్థలను పోషించి, ఓటుబ్యాంకును కోల్పోవడం అవివేకం. గతంలో టెక్కలి కేంద్రంగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను కార్యాలయం ఎదురుగా పెట్టిన విశ్వసముద్ర కార్యాలయంలోనే ఇప్పుడు ఏఎమ్మార్ కార్యాలయం కూడా నడుస్తుంది. విశ్వసముద్ర బోర్డును తీసేసి ఏఎమ్మార్ అని కొత్త బోర్డు పెట్టడం మినహా మిగిలినదంతా సేమ్ టు సేమ్.

## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

క్రీడలలో మరింత రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.ధనబాలాజీ అన్నారు. 9వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ ఇంటర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 24-25లో పాల్గొని మూడవ స్థానం కైవసం చేసుకున్న పీయూసీ విద్యార్థిని వినూత్నను రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ అభినందిస్తూ చదువుతో పాటు విద్యార్థినీ విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. క్రీడలలో రాణించి ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని, వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాల అధిరోహించాలని హితవు పలికారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ, డీన్ మోహన కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన రాజు, టి.విలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల్లో అక్షరాస్యత పెంచేందుకు ఉల్లాస్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్రప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తెలిపారు. జిల్లా స్థాయి ఉల్లాస్ ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డిఆర్డీఏ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ముద్దాడ వెంకటరమణ మాట్లాడుతూ అక్షరాస్యతలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు 'ఉల్లాస్' దోహదం చేయనుందన్నారు. ఈ శిక్షణకు పొదుపు సంఘాల్లో మహిళలు, పాఠశాలల్లో పనిచేసే సహాయకులు, వంట పనివారు, ఆయాలు, అంగన్వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమములో సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, ఏపీవో బాలచందర్ పాల్గొన్నారు.

**అద్దెకొరకు**

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

**94403 72300, 98487 96626**

## హస్తకళలను ఆదరించాలి

- ✔ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- ✔ ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపమైన ప్రాచీన హస్తకళలను ఆదరించి హస్త కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఫారెస్ట్ ఆఫీసు ఎదురుగా హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కళా నైపుణ్యంతో రూపొందించిన ఉత్పత్తులను ఒకే వేదిక పై ప్రదర్శించి అమ్మకాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీన హస్తకళలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, కళంకారి, ఖాదీ వస్త్రాలు, మంగళగిరి చీరెలు, బ్లౌజ్ మెటీరియల్స్, వరంగల్



టవల్స్, లుంగీలు, హైదరాబాద్ ఎంబ్రాయిడరీ చీరెలు, చిన్నారుల ఫ్రాక్స్, స్కర్ట్స్, కొండపల్లి బొమ్మలు, లెదర్ బ్యాగ్‌లు, ఇమిటేషన్ జ్యుయెలరీ, కళాత్మక ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నేతలు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆయుర్వేదంలో సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు

- ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం
- సీనియర్ వైద్యాధికారి పి. జగదీష్

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)


ఆయుర్వేద వైద్యంలో సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వ్యాధులని నయం అవుతాయని సీనియర్ వైద్యాధికారి పి. జగదీష్ అన్నారు. తొమ్మిదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద మూలపురుషుడైన భగవాన్ ధన్వంతరీ చిత్రపటానికి పూల మాలలు వేసి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ధన్తేరాస్, ధనత్రయోదశి రోజున ధన్వంతరి జయంతిగా ప్రతిసంవత్సరం జరుపుకుంటున్నమన్నారు. భారత ఆయుష్ మంత్రిత్వ శాఖ 2016లో జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా ప్రకటించిందన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులు నుంచి వివిధ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ చేపట్టామన్నారు. "ఆయుర్వేద ఫర్ గ్లోబల్ హెల్త్" అనే నినాదంతో తొమ్మిదో జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయుర్వేదం వైద్యం భారతీయ సంస్కృతి, సాంప్రదాయం, జీవన విధానంలో భాగమన్నారు. మనిషి నిత్య జీవితంలో ఆందోళన, శారీరక, మానసిక వ్యాధులకు గురవుతున్నారన్నారు. మనిషి నిత్యం యోగ చేయడం, జీవన శైలిని క్రమపద్ధతిలో అవలంబించాలన్నారు. దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం చక్కటి పరిష్కారం మార్గమన్నారు. ఆయుర్వేద మందులు వాడే సమయంలో పత్యం పాటించాలన్నిది కేవలం అపోహ మాత్రమేనన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయుర్వేద వైద్యశాల ఆధునీకరించామన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్, వెల్నెస్ సెంటర్‌గా అప్డేట్ చేసినట్టు తెలిపారు. రోగులకు మరింత మెరుగైన సేవలందించేందుకు సీనియర్ వైద్యాదికారి అందుబాటులో ఉన్నారని తెలిపారు. యోగా నేర్పించేందుకు ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. అన్నిరకాల మందులతోపాటు, వాటర్ ప్యూరిఫైయర్,వాటర్‌కూలర్ సౌకర్యాలు కల్పించామన్నారు. ఔషధ మొక్కలపై అవగాహన కల్పించేందుకు హెర్బల్‌గార్డెన్ నిర్మించామన్నారు. రోగులకు మెరుగైన సౌకర్యములు అందించడం వలన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ వారిచే వైద్యశాల గుర్తింపు పొందినట్టు తెలిపారు. వైద్యశాలలో ఉదయం 9నుంచి సాయంత్రం 4వరకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, ఆయుష్ కాంపౌండర్ జాడ చంద్రశేఖరరావు, వాకర్స్ ప్రెసిడెంట్ కొంక్యాన మురళీ, యోగ మురళి, గాయత్రిలు పాల్గొన్నారు.




## టీడీపీలో సభ్యులుగా చేరండి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

టీడీపీలో సభ్యత్వం తీసుకొని భవిష్యత్తు భరోసా కల్పించుకోవాలని విజయగనరం ఎంపీ, ఐటీ, కమ్యూనికేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. జి.సిగడాం మండలం మదుపాం, దేవరవలస గ్రామాల్లో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు మార్గదర్శిగా ఉండే శక్తి తెలుగుదేశానికి ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావడానికి కృషిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తూ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కుమరాపు రవి, మదుపాం సర్పంచ్ బొగాది అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు, తిరుమారెడ్డి వెంకటరావు, జనసేన మండల అధ్యక్షులు మీసాల రవి, మెట్టవలస సర్పంచ్ సీతారాం, బాతువ సర్పంచ్ డబ్బాడ ఆదినారాయణ, జగన్నాథం, అల్లు జోగినాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లావ్యాప్తంగా 94 తాత్కాలిక లైసెన్స్‌లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లావ్యాప్తంగా 30 మండలాల పరిధిలో 94 బాణసంచా దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరుచేసినట్టు జిల్లా అగ్నిమాపక శాఖ ప్రధాన అధికారి జె.మోహనరావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లైసెన్స్ కలిగిన బాణసంచా మాత్రమే వినియోగించాలన్నారు. అనధికారికంగా మందుగుండు విక్రయించేవారిపై పోలీస్ శాఖతో కలిసి వెళ్లి దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ జరుపుకొనే పండుగ దీపావళి అని, దీన్ని ఆనందంగా ఆహ్లాదకరంగా జరుపుకోవాలన్నారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రమాదరహిత దీపావళి, పర్యావరణ హిత దీపావళి చేయటం తమ లక్ష్యమన్నారు. కాటన్ దుస్తులు ధరించి, నీటి నిల్వలు సిద్ధం చేసుకొని, బాణసంచా కాల్చాలని మోహనరావు సూచించారు. మందుగుండు విషయంలో అజాగ్రత్త వహిస్తే జీవితాలు నాశనమవుతాయని, ప్రతిఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు బాణా సంచా కాల్చే సమయంలో పెద్దలు పక్కనే ఉండాలని సూచించారు.

## డీఆర్వోను కలిసిన రెవెన్యూ సంఘం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా రెవెన్యూ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మారెళ్ల వెంకటేశ్వరరావును కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఆఫీస్ సబార్డినేటర్ స్థాయి నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు గల ఖాళీలను అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించి భర్తీ చేయడానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, ట్రెజరర్ మురళీధర్‌నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ రామలింగం, యూనిట్ అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, కార్యదర్శి డి.ప్రకాశరావులు పాల్గొన్నారు.



## రిటైర్డ్ ఉద్యోగుల కమిటీ ధర్నా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేసి రిటైరైన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ధర్నా నిర్వహించింది. రిటైర్డ్ ఉద్యోగి భార్య చనిపోయినా మట్టి ఖర్చులు చెల్లించాలని, హయ్యర్ పెన్షన్ ఎంత వస్తుందో తెలపాలని, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాబట్టడం, ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, 2006 నుంచి 2014 వరకు ఆర్టీసీ ఉద్యోగుల నిజవేతనాల నుంచి మినహాయింపులు జరిగాయని, వాటిని వడ్డీతో సహా చెల్లించాలని, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, కనీస పెన్షన్ రూ.9వేలు చేసి డీఏ ఇవ్వాలనే డిమాండ్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో రీజనల్ సెక్రటరీ పీవీఎస్ రావు, బీఎల్ రావు, కిల్లి చంద్రయ్య, సాకేటి అప్పలనాయుడు, డి.రామారావు, ఆదినారాయణ మూర్తితో పాటు అన్ని తరగతుల పెన్షనర్ల సంఘం అధ్యక్షులు హాజరయ్యారు.




## రొమ్ముకేన్సర్‌ను గుర్తిస్తే చికిత్స సులభం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రారంభ దశలో రొమ్ము క్యాన్సర్ గుర్తిస్తే చికిత్స చేయటం ఎంతో సులభతరం అవుతుందని ప్రముఖ వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం శ్రీకాకుళం అధ్యక్షురాలు డాక్టర్ దుంగ హర్షవల్లి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం సంయుక్త నిర్వహణలో రొమ్ము కేన్సర్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో కేన్సర్‌ను గుర్తిస్తే చికిత్స చేయటం ఎంతో సులభతరమవుతుందన్నారు. ప్రధాని మోడీ కేన్సర్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో కేన్సర్‌ను చేర్చి ఉచితంగా చికిత్స అందిస్తున్నారన్నారు. కేంద్రం శరీరంలో ఎక్కడైనా వాపు లేదా గడ్డలు వస్తే సత్వరమే చికిత్స చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో బ్రెస్ట్ కేన్సర్‌పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్ణయం మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకిలా సారధ్యంలో సదస్సు, ర్యాలీ చేపట్టామన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిమ్స్ ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, నగరంలోని మహిళా వైద్యులు, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.